మన సమగ్ర
# ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే... 5 PM
తెలుగు డైలీ
శుక్రవారం , ఆగస్టు 21, 2026
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net

## మర్రి జనార్ధన్ రెడ్డిపై కేసు నమోదు



**హైదరాబాద్ :**బీఆర్ఎస్ నేత, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా రాస్తారోకో నిర్వహించి, విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై ఈ చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే... నాగ ర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై మర్రి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిన్న ధర్నా, రాస్తారోకో చేపట్టారు. సుమారు గంటపాటు రహదారిని దిగ్బంధించడంతో సాధారణ ప్రజలకు, రవాణా వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనంతరం వీరు అనుమతి లేకుండా ఆర్డీఓ కార్యాలయంలోకి ప్రవేశించి నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ కానిస్టేబుల్ పాత్లావత్ దేవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డితో పాటు మరో 38 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.



## చివరి నిమిషంలో రేవంత్ అమెరికా టూర్ రద్దు.

- అమెరికా సమావేశాలకు కేంద్రం అనుమతి నిరాకరణ
- ఈ నెల 23న లండన్ నుంచి హైదరాబాద్ చేరుకోనున్న సీఎం
- వచ్చే నెలలో అమెరికా వెళ్లే యోచన
- అమెరికా భేటీలకు అధికారులను పంపే అవకాశం
- 'తెలంగాణ రైజింగ్' ఆగదని సీఎం స్పష్టీకరణ

**హైదరాబాద్ :**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన చివరి నిమిషంలో రద్దయింది. అమెరికాలో నిర్వహించాల్సిన 'తెలంగాణ రైజింగ్' సమావేశాలకు కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి ఇవ్వకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో బ్రిటన్ పర్యటన ముగించుకొని సీఎం ఈ నెల 23న లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి లండన్, అమెరికాలో 'తెలంగాణ రైజింగ్' పేరుతో సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా అమెరికాలోని బోస్టన్, న్యూయార్క్‌లో సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి కార్యాలయం షెడ్యూల్ కూడా సిద్ధం చేసింది. అయితే చివరి నిమిషంలో కేంద్ర విదేశాంగ శాఖ నుంచి అనూహ్య పరిణామం ఎదురైంది. యూకేలో జరిగే సమావేశాలకు మాత్రమే అనుమతి లభించింది. అమెరికాలో నిర్వహించాల్సిన సమావేశాలకు గ్రీన్‌సిగ్నల్ రాలేదు. దీంతో సీఎం తన పర్యటనను కుదించుకుని హైదరాబాద్‌కు తిరిగి రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే, కేంద్రం నిర్ణయం వెనక కారణం ఏంటనేది మాత్రం ఇంకా అధికారికంగా తెలయరాలేదు. ప్రస్తుతం రద్దయిన అమెరికా పర్యటనను వచ్చే నెలలో చేపట్టాలని సీఎం భావిస్తున్నట్లు సమాచారం. ఈసారి అమెరికాలో జరగాల్సిన భేటీలకు సీఎం స్వయంగా వెళ్లకుండా అధికారుల బృందాన్ని పంపే యోచన కూడా ఉన్నట్లు తెలుస్తోంది. తన అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలకు అతీతంగా తెలంగాణ యువత భవిష్యత్తు, రాష్ట్ర అభివృద్ధే తన తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా 'తెలంగాణ రైజింగ్' ప్రయాణం ఆగదని ధీమా వ్యక్తం చేశారు.

## తెలుగు రాష్ట్రాల్లో 10 చోట్ల ఈడీ తనిఖీలు

### టార్గెట్‌గా ఎంపీ అవినాశ్ రెడ్డి


**హైదరాబాద్:**మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దరా ్యప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) షాక్ ఇచ్చింది. వివేకా హత్య కేసు విచారణలో భాగంగా అధికారులు ఆయన నివాసాలు, కార్యాలయా ల్లో ఏకకాల ంలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ కేసులో మనీలాం డరింగ్ జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ రంగం లోకి దిగింది. ఈ రోజు తెల్లవారుజాము నుంచే హైదరాబాద్, పులివెందులలోని అవినాశ్ రెడ్డి నివాసాలు, కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు 10 ప్రాంతాల్లో వేర్వేరు బృందాలు ఏకకాలంలో ఈ సోదాలు నిర్వహిస్తున్నాయి. అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు, కీలక పత్రాలు, ఆస్తుల వివరాల కోసం అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈ కేసుతో సంబంధం ఉన్న ఇతర నిందితుల నివాసాల్లోనూ ఈడీ సోదాలు కొనసాగుతున్నాయి. పులివెందులలోని దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, ఎర్ర , సునీల్



యాదవ్ ఇళ్లతో పాటు, తొండూరు టి.తుమ్మలపల్లిలోని గంగిరెడ్డి నివాసంలోనూ తనిఖీలు జరుగుతున్నాయి.

## యువతే టార్గెట్


- జెన్-జీపై రాహుల్ గాంధీ ప్రత్యేక దృష్టి
- యువతుల సమస్యలపై నేరుగా చర్చ
- ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంతో క్షేత్రస్థాయిలోకి



**న్యూఢిల్లీ :** పెద్ద సభలు.. భారీ ప్రసంగాలు.. రాజకీయ నినాదాలు. ఇలాంటి సంప్రదాయ ప్రచారానికి భిన్నంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇప్పుడు యువతతో నేరుగా మాట్లాడుతున్నా రు. ముఖ్యంగా జనరేషన్-జెడ్ (జెన్-జీ), యువతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వారితో ముఖాముఖి చర్చిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగానూ అదే తరహా సంభాషణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. యువతను చేరుకునే ఈ ప్రయత్నం 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంతో మరింత ఊపందుకుంది. పోటీ పరీక్షల ఒత్తిడి, పేపర్ లీకులు, విద్యా వ్యవస్థలో జాప్యం వంటి సమస్యలపై ఇందులో చర్చలు జరిగాయి. కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్ వంటి కేంద్రాల్లో మొదలైన ఈ కార్యక్రమం క్రమంగా విస్తరించింది. యువతులపై ప్రత్యేక దృష్టిఇ టీవల పూణెలో జరిగిన కార్యక్రమాల్లో రాహు ల్ గాంధీ యువతుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. కెరీర్‌లో ఎదురయ్యే అడ్డంకులు, భద్రత, ఉద్యోగ ప్రదేశాల్లో పరిస్థితులు, కుటుంబం, సమాజం విధించే ఆంక్షలపై వారితో మాట్లాడారు.

### అందరిపై వరలక్ష్మీ దేవి

## ఆశీస్సులు ఉండాలి



**అమరావతి:**వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఏపీ ప్రజలకు సీఎం చంద్రబాబు శుభాకా ంక్షలు అందరిపై వరలక్ష్మీ దేవి ఆశీస్సు లు ఉండాలని ఆకాంక్ష పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకు న్న సీఎం కుటుంబ సౌభాగ్యం కోసం శ్రమించే మహిళలకు ప్రత్యేక శుభాకా ంక్షలు వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని పురస్క రించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా తన సందేశాన్ని పంచుకున్నారు. "వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మీకు, మీ కుటుంబ సభ్యులకు నా శుభాకాంక్షలు" అని చంద్రబాబు పేర్కొన్నారు. సిరిసంపదలు, సౌభాగ్యానికి అధిదేవత అయిన వరలక్ష్మీ దేవి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పాడిపంటలతో, సుఖసంతోషాలతో సుభిక్షంగా, సమృద్ధిగా ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. కుటుంబ సౌభాగ్యం కోసం శ్రమించే మహిళలందరికీ ఈ పవిత్ర పండుగ విశేషమైన శుభాలను, శాంతిని ప్రసాదించాలని ఆశిస్తున్నట్లు తన పోస్టులో పేర్కొన్నారు.

## కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

- కొండా సురేఖపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆగ్రహం
- 15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీల భేటీ
- సుస్మిత వ్యాఖ్యలపై సమావేశంలో తీవ్ర చర్చ
- వ్యాఖ్యలను సురేఖ ఖండించకపోవడంపై అభ్యంతరం



**హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం రోజురోజుకూ ముదురుతోంది. ఈ అంశంపై ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాలకు చెందిన 15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మె ల్సీలు సీఎల్పీ వేదికగా సమావేశమై చర్చించారు. అనంతరం కొండా సురేఖను రాష్ట్ర మంత్రివర్గం నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను టార్గెట్ చేస్తూ కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై సమావేశంలో తీవ్ర చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఆమె వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం ఇప్పటికే ఆగ్రహంతో ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు కూడా సురేఖకు వ్యతిరేకంగా గళం విప్పారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యేలు మీడియా సమావేశంలో మాట్లాడారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలను కొండా సురేఖ ఇప్ప టివరకు ఖండించకపోవడాన్ని ఎమ్మెల్యేలు తీవ్రంగా తప్పుబట్టారు. మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలపై బాధ్యత వహించాల్సిందేనని అభిప్రాయపడ్డారు. సీఎంను వ్యతిరేకించే వారికి పార్టీలో ఉండే అర్హత లేదని స్పష్టం చేశారు.

### ఉచిత పథకాల వల్ల ప్రభుత్వ ఖజానాకు

## ఆర్థికంగా ప్రమాద ఘంటికలు





**హైదరాబాద్:** ఉచిత పథకాల వల్ల ప్రభుత్వ ఖజానాకు ఆర్థికంగా ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని హైకో ర్టు ఆందోళన వ్యక్తం చేసింది. పింఛ న్లు, ఇతర బెనిఫిట్లు ఇవ్వడం లేదం టూ పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు కోర్టులను ఆశ్రయిస్తున్నా రని న్యాయస్థానం పేర్కొంది. ప్రభుత్వ ఆర్థిక విధానాల్లో కోర్టులు జోక్యం చేసుకోలేనప్పటికీ పన్నుల చెల్లింపు వల్ల వచ్చే ఆదాయాన్ని ఉచితాలకు ఉపయోగించడం సరికాదని ధర్మాసనం ప్రభుత్వానికి స్పష్టం చేసింది. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చట్టబద్ధతను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్ గోపాల్ దాఖలు చేసిన పిటిషన్?పై హైకోర్టు గురువారం మరోసారి విచారణ చేపట్టింది. బాల్య వివాహాలను నిర్మూలించడానికే : భూసేకరణలో భాగంగా భూమి కోల్పోయిన బాధితులకు అందించే పరిహారానికి సంబంధించిన వివరాలను దాఖలు చేయాలంటూ హైకోర్టు బుధవారం జరిపిన విచారణ సందర్భంగా అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్?ఖాన్?ను ఆదేశించింది. తీసుకొచ్చామని, బడ్జెట్?లో ఈ పథకాలకు ప్రత్యేకంగా కేటాయింపులు ఉన్నాయని ఏజీ వాదించారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంఘటన్ సృజన్ అభియాన్

**- సంస్థాగత బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి**

**మన సమగ్ర ప్రజావాణి ఆగస్టు 21 ( జోగిపేట ) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి**

కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా చేపట్టిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశాన్ని ఆధునిక సాంకేతికత వైపు నడిపించడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని అన్నారు. యువతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ రంగాల అభివృద్ధికి ఆయన తీసుకున్న చర్యలు భారతదేశ ప్రగతికి పునాది వేశాయని పేర్కొన్నారు.దేశ ఐక్యత, అభివృద్ధి కోసం రాజీవ్ గాంధీ చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయన




ఆశయాలను కొనసాగిస్తూ బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రతి కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలని నాయకులు సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయడం, ప్రజలతో నిరంతరం సంబ ంధాలు కొనసాగించడం ద్వారా కాంగ్రెస్ పార్టీని మరింత బలో పేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు ) మార్కెటింగ్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డిఆత్మకమిటి డైరెక్టర్ చిట్యాల మధు, ఖాలేదు, కౌన్సిలర్లు అరుణ్,అనిల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. సంఘటన్ సృ జన్ అభియాన్ ద్వారా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటి ష్టం చేయడమే లక్ష్యంగా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**- కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులు**

**టేక్మాల్ ఆగస్టు 21 మన ప్రజావాణి:** విద్యుత్ ఘాతంతో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కుసంగి గ్రామంలో జరిగింది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పత్తిగారి ఎల్లా గౌడ్ (58) మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో పొలం వద్ద విద్యుత్ పనులు మరమ్మత్తులు చేస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది అనుకోని ఈ ఘటనతో ఆయన కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది కుటుంబానికి అండగా ఉండాల్సిన ఇంటి పెద్ద ప్రాణాలు కోల్పోవడంతో భార్య పిల్లలు దిక్కుతోచని స్థితిలో రోదిస్తున్నారు బాధితుడి కుటుంబాన్ని ప్రభుత్వం మరియు విద్యుత్ శాఖ తరపున బాధితుడి కుటుంబాన్ని ఆదుకోవాలని తగిన ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు గ్రామస్తులు కోరుతున్నారు సంబంధిత అధికారులు స్పందించి బాధితుడి కుటుంబానికి తక్షణ సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు



# సుందిల్ల ఓసీపీ భూసేకరణలో నిజమైన సాగుదారులకు అన్యాయం...?

**-నష్టపరిహారం చెల్లింపులపై సుందిళ్ల దళిత రైతుల అభ్యంతరం.**


**-అధికారిక రికార్డులు ఉన్నా తమను పక్కన పెడుతున్నారని ఆరోపణలు.**

**-సర్వే,రీ సర్వే నిర్వహించి అర్హులను గుర్తించాలంటూ డిమాండ్.**




**పెద్దపల్లి జిల్లా, మన సమగ్ర ప్రజావాణి ఆగస్టు 20:**

సింగరేణి సంస్థ చేపడుతున్న ఓసీపీ 5 ప్రాజెక్టు కోసం సుందిల్ల గ్రామ శివారులో భూసేకరణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో నష్టపరిహారం, సెటిల్మెంట్ చెల్లింపులపై దళిత రైతులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.ఏళ్ల తరబడి భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమను పక్కన పెట్టి,వాస్తవ సాగుతో సంబంధం లేని వారికి నష్టపరిహారం చెల్లిస్తున్నారనే ఆరోపణలు చేస్తున్నారు.తమ వద్ద అడంగల్,పహాణీ, పట్టాదారు పాస్‌బుక్ తదితర అధికారిక భూ రికార్డులు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. అయినప్పటికీ భూమి వద్ద ఫొటోలు దిగినంత




మాత్రాన లేదా స్పష్టమైన సాగు ఆధారాలు లేని వ్యక్తులకు చెల్లింపులు జరుగుతున్నట్లు తమ దృష్టికి వస్తోందని వారు ఆరోపిస్తున్నారు.ఇదే జరిగితే భూమిపై ఆధారపడి జీవిస్తున్న నిజమైన రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులకు విన్నవించినా ఫలితం లేదంటూ...**

ఈ సమస్యపై రామగుండం ఆర్జీ వన్ జీఎం లలిత్‌కుమార్‌కు పలుమార్లు విన్నవించినప్పటికీ ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని బాధిత రైతులు చెబుతున్నారు. తమ భూములకు సంబంధించిన రికార్డులు, సాగు ఆధారాలను పరిశీలించి న్యాయం చేయాలని కోరుతున్నప్పటికీ స్పందన లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.మా భూములను తీసుకుంటూ, మా హక్కులను గుర్తించకుండా నష్టపరిహారం ఎలా చెల్లిస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు.అధికారిక రికార్డులు,సాగు ఆధారాలను పరిగణనలోకి తీసుకోకుండా చెల్లింపులు జరిగితే భవిష్యత్తులో మరిన్ని వివాదాలకు దారితీసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

**సమగ్ర విచారణకు డిమాండ్.....**

భూసేకరణ,నష్టపరిహారం చెల్లింపుల ప్రక్రియపై ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.సర్వే,రీ సర్వే నిర్వహించి వాస్తవంగా భూమిని సాగు



చేస్తున్న వారిని గుర్తించాలని కోరుతున్నారు.ఇప్పటికే ఏమైనా చెల్లింపులు జరిగి ఉంటే వాటి వివరాలను పరిశీలించి, అవకతవకలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.నష్టపరిహా రం,సెటిల్‌మెంట్ చెల్లింపులను విచారణ పూర్తయ్యే వరకు తాత్కాలికంగా నిలిపివేయాలని,భూములకు సర్వే,రీ సర్వే నిర్వహించి వాస్తవ సాగుదారులను గుర్తించి,అడంగల్,పహాణీ, పట్టాదారు పాస్‌బుక్,పాత భూ రికార్డులు,సాగు ఆధారాలను పరిశీలించాలని,అర్హులైన నిజమైన రైతులకే నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందించాలి.ఇప్పటికే జరిగిన చెల్లింపులపై సమగ్ర విచారణ జరపాలని,దళిత రైతుల భూముల విషయంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక విచారణ చేపట్టి,రైతుల అభ్యంతరాలను అధికారికంగా నమోదు చేసి,వివాదాస్పద భూములపై విచారణ పూర్తయ్యే వరకు చెల్లింపులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.భూమి కోల్పోయేది మేము.. జీవనాధారం కోల్పోయేది మేము.. అలాం టప్పుడు నష్టపరిహారం మాత్రం వేరే వారికి ఎలా అంటూ సుందిల్ల దళిత రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, సింగరేణి ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి భూ రికార్డులు,సాగు ఆధారాలను సమగ్రంగా పరిశీలించి నిజమైన రైతులకు న్యాయం చేయ లని వారు కోరుతున్నారు.నష్టపరిహారం చెల్లింపులపై వస్తున్న ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

# హెచ్ .సి .యూ లో సీటు సాధించిన యువతికి సన్మానించిన గ్రామ సర్పంచ్ అరిగే ధర్మ తేజ.



**హైదరాబాద్** సెంట్రల్ యూనివర్సిటీ ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కోర్సులో హిస్టరీ భాగంలో 96 % సీటు సాధించిన బీర్మూరు గ్రామానికి చెందిన మల్లెలక్యాకప్ప గారి కుమార్తె శివ సీతన కు బీర్మూరు గ్రామ సర్పంచ్ అరిగే ధర్మతేజ మరియు గ్రామ యువకులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ మాట్లాడుతూ శివ సీతనకు శుభాకాంక్షలు తెలిపి ఉన్నత స్థాయికీ వెళ్లి గొప్ప ఐఏఎస్ ఆఫీసర్ గా, మంచి మార్కులు సాధించి తల్లిదండ్రుల పేర్లను మన ఊరు పేరును నిలబెట్టాలని ఆశించారు. ఇట్టి కార్యక్రమంలో ,కుర్రి కృష్ణ, శివ యాదవ్, యోగి, చామకూర రాజు, బసవరాజ్,అరిగే శ్రీకాంత్,నవీన్ రాజశేఖర్ సార్,రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి అండగా నిలిచిన ఎర్రబాటి వెంకటేశ్వరరావు

**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి ఆగస్టు 21**

పెళ్లికి కావాల్సిన సామగ్రిని సమకూర్చి నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన ఎర్రబాటి వెంకటేశ్వరరావుపెద్దపల్లి: పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన సింగిరవేణి స్ఫూర్తి నిరుపేద కుటుంబానికి చెందిన యువతి. ఆమె తండ్రి సురేష్ కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇటీవల స్ఫూర్తికి పెళ్లి సంబంధం కుదిరింది.స్ఫూర్తిని వివాహం చేసుకునేందుకు శాయంపేట మండలం జమ్మికుంట గ్రామానికి చెందిన వీరబోయిన అన్వేష్ ముందుకు వచ్చారు. కీర్తిశేషులు కుమార్ కుమారుడైన అన్వేష్ ఎలాంటి కట్నం ఆశించకుండా, తానే ఎదురుకట్నం ఇస్తూ స్ఫూర్తిని వివాహం చేసుకునేందుకు అంగీకరించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో స్ఫూర్తి






కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఎర్రబాటి వెంకటేశ్వరరావు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి, పెళ్లికి అవసరమైన బోళ్లు (సామగ్రి) సమకూర్చి కుటుంబానికి అండగా నిలిచారు. పేద కుటుంబానికి సహాయం చేయడం పట్ల గ్రామస్తులు ఎర్రబాటి వెంకటేశ్వరరావును అభినందించారు.పేద కుటుంబాలకు అండగా నిలిచి, ఆపదలో ఉన్న వారికి తనవంతు సహాయం అందించడం ద్వారా మానవత్వాన్ని చాటుకుంటున్న ఎర్రబాటి వెంకటేశ్వరరావు సేవలను పలువురు ప్రశంసించారు.

# సోలార్ ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు

**- కరెంట్ సప్లై ఉన్నా లెక్కచేయకుండా కాళ్లతో తొక్కి విరగ్గొట్టిన వైనం**







**మన ప్రజావాణి పలమనేరు రూరల్ ఆగస్టు 21**

పలమనేరు రూరల్ మండలంలోని ఇందిరానగర్ గ్రామ సమీపంలో ఓ ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. గురువారం రాత్రి 9 గంటల తర్వాత పంట పొలాల్లోకి ప్రవేశించిన ఏనుగు పంటలను ధ్వంసం చేస్తుండటంతో రైతులు, ట్రాకర్లు అప్రమత్త మయ్యారు. ఏనుగును అడవిలోకి మళ్లించేందుకు రాత్రంతా టపా సులు, బాణాలు, ఔట్లు పేలుస్తూ తీవ్రంగా శ్రమించారు.ఎట్టకేలకు పొలాల మీదుగా ఏనుగును మళ్లించి అర్ధరాత్రి దాటిన తర్వాత ఇందిరానగర్ కాలనీ సమీపంలోని గుడియాత్తం రోడ్డుపైకి తీసుకువచ్చారు. అయితే ఒక్కసారిగా ఏనుగు వెనుతిరిగి ట్రాకర్లపైకి దూసుకొచ్చేందుకు ప్రయత్నిస్తూ భయంకరంగా అరవ డంతో అక్కడున్న వారంతా భయంతో పరుగులు తీశారు. అనం తరం ట్రాకర్లు, అటవీశాఖ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ఏనుగును రోడ్డుపక్కనున్న అడవిలోకి మళ్లించే ప్రయత్నం చేశారు. కరెంట్ షాక్ కూడా లెక్కచేయలేదు..


అడవిలోకి వెళ్లే క్రమంలో గతంలో ఏర్పాటు చేసిన హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్‌ను ఏనుగు ధ్వంసం చేసింది. కరెంట్ సరఫరా ఉన్నప్పటికీ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా కాళ్లతో తొక్కి ఫెన్సింగ్‌ను విరగ్గొట్టడం స్థానికులను విస్మయానికి గురిచేసింది.

రైతులకు కంటిమీద కునుకులేకుండా..

ఈ ఒంటరి ఏనుగు కొంతకాలంగా నిత్యం ఏదో ఒక ప్రాంతంలో పంటలను ధ్వంసం చేస్తూ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. వర్షాలు లేక అరకొరగా సాగు చేసిన పంటలను తినడంతోపాటు పొలాల వద్ద ఉన్న పశువుల షెడ్లు, పట్టుపురుగుల షెడ్లు, ఇళ్లను సైతం ధ్వంసం చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ఏనుగు భయంతోరాత్రివేళల్లోపొలాలవద్దకు వెళ్లేందుకు రైతులు జంకుతున్నారు.

**బంధించాలి.. ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి**

రాత్రివేళల్లో పంటలపైకి వస్తున్న ఏనుగు రైతులతోపాటు ట్రాకర్లు, అటవీశాఖ అధికారులను గంటల తరబడి ముప్పుతిప్పలు పెడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఒంటరి ఏనుగును బంధించి, పంట పొలాల వైపు ఏనుగులు రాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ముఖ్యంగా ఇందిరానగర్ కాలనీ నుంచి కాలవపల్లి మీదుగా చెత్తపెంట వరకు వెంటనే సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు



చేయాలని సమీప గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రభుత్వ భూములు సర్వే.

**మన ప్రజావాణి. మంథని ప్రతినిధి.** మంథని మండలం చిల్లపల్లె దుబ్బ పల్లి గ్రామాలలోని ప్రభుత్వ భూములను సర్వే చేయాలని పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు జారీ చేయడంతో మంతని ఎమ్మార్వో ఆఫీసు నుండి సర్వేయర్ ఉమ్మడి గ్రామపంచాయతీ జిపిఓ వనజ వచ్చి చిల్లపల్లి దుబ్బ పల్లె గ్రామాలలోని ప్రభుత్వ భూములను సర్వే చేసి చిల్లపల్లి సర్వే నెంబర్ 170 దుబ్బపల్లి సర్వేనెంబర్ 173 లలో సాగు చేసుకుని జీవనం సాగిస్తున్న రైతుల వద్ద నుండి వాటికి సంబంధించిన పహానిలు గాని పట్టా గాని ఉంటే మాకు ఇవ్వాలని రైతుల వద్ద నుండి తీసుకున్నారు అసలే పేద రైతులం మాకు భూమి లేక ప్రభుత్వ భూమిని దున్నుకొని జీవనం సాగిస్తున్నాం ఇప్పుడు ఆ భూమిని లాక్కుంటారో ఏమైనా మాకు సాయం చేస్తారో అని రైతులు భయపడుతున్నారు



దుబ్బ పల్లి గ్రామానికి చెందిన రైతు ఆవునూరు లింగయ్య శంకరమ్మ మాట్లాడుతూ మాకు 30 సంవత్సరాల క్రితం అప్పుడున్న ప్రభుత్వం 173 సర్వే నెంబర్లు లో దళితులకు ఒక్కొక్కరు చొప్పున మూడు ఎకరాల భూమి అసైన్డ్ చేసిందని అప్పటినుండి ఇప్పటివరకు ఆ భూమిని సాగు చేసుకుని జీవిస్తున్నామని అన్నాడు మాకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు


Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com